# నేడు వికారాబాద్‌కు మంత్రి కేటీఆర్ రాక

- రూ.173 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- రూ.96 కోట్లతో నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి, మున్సిపాలిటీ పరిధిలో రూ.55 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- గిరిజన భవన్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను, సఖి సెంటర్‌ను ప్రారంభించనున్న కేటీఆర్
- అనంతరం బ్లాక్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు





వికారాబాద్ ప్రధాన రహదారి వెంట గులాబీమయం

వికారాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమల శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు నేడు వికారాబాద్‌కు రానున్నారు. వికారాబాద్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. మధ్యాహ్నం 2.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా యువ సారథి కేటీఆర్ వికారాబాద్‌కు చేరుకోనున్నారు. హెలిప్యాడ్ నుంచి నేరుగా బ్రిడ్జి సమీపంలోని హనుమాన్ ఆలయం వద్ద వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.174 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలతోపాటు ప్రారంభోత్సవాలకు సంబంధించి ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రులు సబితారెడ్డి, మహేందర్‌రెడ్డిలతో కలిసి మంత్రి కేటీఆర్ ఆవిష్కరించనున్నారు. అనంతరం వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ నివాసానికి చేరుకొని, అక్కడి నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలికి మంత్రి కేటీఆర్ చేరుకోనున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డితోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## రూ.173.05 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రూ.173.05 కోట్లతో అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపనలతోపాటు ప్రారంభోత్సవాలను మంత్రి కేటీఆర్ చేయనున్నారు. డీటీసీ వద్ద రూ.1.10 కోట్లతో నిర్మించిన గిరిజనుల ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన గిరిజన భవన్‌ను, రూ.48.69 లక్షలతో రామయ్యగూడ పీహెచ్‌సీ సమీపంలో నిర్మించిన సఖీ సెంటర్‌ను, రూ.1.54 కోట్లతో రిక్షా కాలనీ సమీపంలోని కేజీబీవీలో నిర్మించిన అదనపు తరగతి గదులను, రూ.1.20 కోట్లతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను, రూ.52.50 లక్షలతో నిర్మించిన నైట్ షెల్టర్లతోపాటు వీధి వ్యాపారులకు ఏర్పాటు చేసిన షెడ్స్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉండి వికారాబాద్ మున్సిపాలిటీ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులిచ్చింది. రూ.96 కోట్లతో నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి, రూ.30 కోట్లతో వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి, మున్సిపాలిటీ పరిధిలో రూ.25 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి, వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.5 కోట్లతో పార్కుల సుందరీకరణ పనులకు, వికారాబాద్ మున్సిపాలిటీలోని ఆలంపల్లిలో రూ.2 కోట్లతో నిర్మించనున్న మోడ్రన్ దోబీఘాట్‌కు, ఆలంపల్లి, రామయ్యగూడల్లో ఒక్కోటి రూ.కోటితో వైకుంఠధామాల నిర్మాణ పనులకు మంత్రి కేటీఆర్ నేడు శంకుస్థాపన చేయనున్నారు.

## బ్లాక్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం మంత్రి కేటీఆర్ బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు విచ్చేయనున్నారు. 20 వేల మందికిపైగా జనాలతో సభ నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. బహిరంగ సభకు తరలివచ్చే బీఆర్‌ఎస్‌శ్రేణులు, ప్రజల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు. కేటీఆర్ పర్యటనతో పట్టణమంతా గులాబీమయమైంది.



బహిరంగ సభకు ముస్తాబు

# స్వీప్‌పై విద్యార్థులకు అవగాహన

వికారాబాద్, అక్టోబర్ 4 : స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు అవగాహనపై నిర్వహించిన పోటీల్లో విజేతలను కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5న హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపామని తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థులు విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కృష్ణన్, డీటీడీవో కోఠాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీపీలో ప్రథమ బహుమతి పొందిన కొత్తపల్లి పాఠశాల విద్యార్థులు


కులకచర్ల : వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోఠాజీ, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటరు అవగాహనపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి150 మంది విద్యార్థులు పాల్గొనగా చౌడాపూర్ మండలం కొత్తపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ బహుమతి పొందారు. పాఠశాల విద్యార్థులు తయారు చేసిన స్కిట్ ఓటర్లను చైతన్యపరిచేలా ఉందని ప్రథమ బహుమతికి ఎంపిక చేశారు. విద్యార్థులకు ట్రైనీ కలెక్టర్ అమిత్‌నారాయణ రూ.10వేలతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్, ఉపాధ్యాయులు విజయ, శ్రవణ్‌కుమార్, రశీద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా ఓటర్లు 9,34,523

**మహిళల ఓట్లే అధికం**

- ఓటరు తుది జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- పురుషులు-4,64,822., మహిళలు-4,69,659., ఇతరులు-42
- అత్యధికంగా పరిగి నియోజకవర్గంలో 2,52,379
- అత్యల్పంగా వికారాబాద్‌లో 2,23,398

వికారాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఓటరు తుది జాబితా ప్రకారం వికారాబాద్ జిల్లాలో 9,34,523 మంది ఓటర్లున్నారు. జిల్లాలో అత్యధికంగా మహిళా ఓటర్లే ఉండడం గమనార్హం. జిల్లాలోని వికారాబాద్ నియోజకవర్గం మినహా మిగతా పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు ఉండగా.. వికారాబాద్ నియోజకవర్గంలో అత్యల్పంగా ఉన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంతో జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో అధిక మొత్తంలో ఓటర్లు పెరిగారు. ఓటరు ముసాయిదా జాబితాతో పోలిస్తే జిల్లాలో భారీగా ఓటర్ల సంఖ్య పెరిగింది. దీని ప్రకారం జిల్లాలో 8,99,395 మంది ఓటర్లుండగా.. తుది జాబితా ప్రకారం 9,34,523 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది. ముసాయిదా జాబితా అనంతరం మహిళలే అధిక సంఖ్యలో ఓటరు జాబితాలో చేరారు. జిల్లాలో పెరిగిన ఓటర్లలో పురుషులు-14,951 మంది కాగా.. 20,689 మంది మహిళా ఓటర్లున్నారు. ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. దీని ప్రకారం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 9,34,523 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు-4,64,822., మహిళలు-4,69,659., ఇతరులు-42 మంది ఉన్నారు.




**ఓటర్లు నియోజకవర్గాలవారీగా..**

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | పురుషులు | మహిళలు | ఇతరులు |
|---|---|---|---|---|
| పరిగి | 2,52,379 | 1,27,835 | 1,24,537 | 7 |
| వికారాబాద్ | 2,23,398 | 1,11,605 | 1,11,780 | 13 |
| తాండూరు | 2,28,495 | 1,11,242 | 1,17,243 | 10 |
| కొడంగల్ | 2,30,251 | 1,14,140 | 1,16,099 | 12 |

# రైతులు జొన్న పంట వైపు మొగ్గుచూపాలి



మాట్లాడుతున్న పరిశోధన సంస్థ కేంద్రం శాస్త్రవేత్త శేఖర్

పెద్దేముల్, అక్టోబర్ 4 : రైతులు జొన్న పంట వైపునకు మొగ్గుచూపి ఎక్కువ మొత్తంలో సాగు చేయడానికి ముందుకు రావాలని తాండూరు వ్యవసాయ పరిశోధన సంస్థ కేంద్రం శాస్త్రవేత్త శేఖర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని హన్మాపూర్‌లో 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా యాసంగి జొన్నలో మేలైన యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు జొన్న పంటను సకాలంలో విత్తుకోవాలని, తేమను నిలుపుకొనే చిన్న చిన్న మడులు చేసుకొనే పద్ధతి, జొన్నలో ఎరువులు చీడపీడల యాజమాన్య పద్ధతిలో సాగు చేయాలన్నారు. జొన్న పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి స్వాతి, రైతులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

**రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్**
**బీసీ జేఏసీ, కళాశాల కమిటీల ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశం**

తాండూరు, అక్టోబర్ 4: చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం తాండూరులో బీసీ జేఏసీ, కళాశాల కమిటీల ప్రతినిధుల విస్తృతస్థాయి సమావేశంలో శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. బీసీలు సంఘటితంతో హక్కులు సాధించుకోవాలన్నారు. కొన్నేండ్లుగా కుల గణన చేపట్టక పోవడం బాధాకరమన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ చిత్త శుద్ధితో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. జనాభాలో బీసీలో ఎక్కువగా ఉన్నప్పటికీ అన్నింటిలో మనకు అన్యాయం జరుగుతున్నదన్నారు. అందుకు నేటి తరం సంఘటితంతో హక్కుల సాధనకు పోరాటం చేయాలని ఆయన సూచించారు.

నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని మాట్లాడుతూ.. బీసీలు అనేక సంవత్సరాలుగా అణచివేతకు గురవుతున్నారన్నారు. ఎంతో పోరాటం చేసిన బీసీ రిజర్వేషన్లు కేవలం 25 శాతం అమలు కావడం చాలా బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపకులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రతినిధులు